నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 01 జూన్ 2024 | www.navatelangana.com

ఏప్రిల్ ఒకటి నుంచే పెంచిన బీడీ ధరలు అమలు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్దిపేట

1000 బీడీలకు పెరిగిన ధరలు ఏప్రిల్ ఒకటి నుంచే అమల్లోకి వస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిజామాబాద్‌లోని నిఖిల్ సాయి హెూటల్‌లో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ టేకదార్లకు, బీడీ యజమాన్యం, యూనియన్ నాయకులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.1000 బీడీలకు రూ .4.50 పైసలు పెంచడం జరిగిందని తెలిపారు. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచే ఇవ్వాలని ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఏప్రిల్ నెల నాటి పెరిగిన ధరల డబ్బులను జులై నెలలో చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీడీ టేకదార్ల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు ఎం.సిద్దిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల శ్రీనివాస్, కె చంద్రశేఖర్, కె.రమేష్, ఇతర యూనియన్ నాయకులు, యజమానుల అసోసియేషన్ నుండి అధ్యక్షులు హితేంద్ర ఉపాధ్యాయ, కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ, రష్మీకాంత్ పటేల్‌లు పాల్గొన్నట్లు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పూర్తి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి.

నవతెలంగాణ-రాయపోల్ : జూన్ 12 పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల మౌలిక వసతులు, అభివృద్ధి పనులను పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అనాజీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, రాయపోల్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యా విధానాలను బలోపేతం చేయడం కోసం పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని దానిలో భాగంగానే గతంలో ఉన్న ఎస్ఎంసి కమిటీలను రద్దుచేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నియమించడం జరిగిందన్నారు. పాఠశాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు పాఠశాల విద్యార్థుల బోధనకు సంబంధించి విధివిధానాలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలలు జూన్ 12వ తేదీన పున ప్రారంభించబడతాయని అప్పటి వరకు అన్ని పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్లకు సూచించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సమ్మ సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధం



14 టేబుల్స్

- అసెంబ్లీ సెగ్మెంట్స్ వారిగా లెక్కింపు
- ముందుగా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు...తర్వాత ఈవీఎంలు
- 19 నుంచి 23 రౌండ్లలో లెక్కింపు పూర్తి
- ప్రతి రౌండ్‌లో 119 పోలింగ్ స్టేషన్ల ఈవీఎంల లెక్కింపు
- జహీరాబాద్‌లో 1973 పోలింగ్ కేంద్రాలు..1225049 ఓట్లు
- మెదక్‌లో 2124 పోలింగ్ కేంద్రాలు... 1372894 ఓట్లు
- కౌంటింగ్ కేంద్రాల్లో భారీ బందోబస్తు...గట్టి నిఘా

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జూన్ 4న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధం చేశారు. జహీరాబాద్ నియోజకవర్గ ఓట్లను స్ట్రాంగ్ రూంల్లో భద్రపర్చిన గీతం యూనివర్సిటీలోనే ఓట్ల లెక్కింపు జరగనుంది. మెదక్ నియోకవర్గ ఓట్లను బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ గిరిజన జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యింది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా ఓట్లను లెక్కిస్తారు. లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కాగానే ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అరగంట గడిచాక ఈవీఎం ఓట్ల లెక్కింపును కూడా షురూ చేస్తారు. కౌంటింగ్ కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగనుంది.

14 టేబుల్స్‌లో లెక్కింపు

ఓట్ల లెక్కింపు కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం వారిగా 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తారు. వాటిల్లో రౌండ్ల వారిగా పోలింగ్ స్టేషన్ వారిగా ఈవీఎంలను తెచ్చి ఏఏ అభ్యర్థికి ఎన్నిక ఓట్లు పడ్డాయనే లెక్కలు తీస్తారు. అలా ప్రతి రౌండ్‌లో 119 పోలింగ్ స్టేషన్ల చొప్పున ఓట్ల లెక్కింపు జరగనుంది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్స్ ఉన్నాయి. మొత్తం 2124 పోలింగ్ స్టేషన్లలో 1372894 ఓట్లు పోలయ్యాయి. ప్రతి సెగ్మెంట్‌లో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారు. ఏడు సెగ్మెంట్ల పరిధిలో ఒక రౌండ్‌కు 119 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 277 పోలింగ్ స్టేషన్లు ఉన్నందున 20 రౌండ్లు, నర్సాపూర్‌లో 307 పోలింగ్ స్టేషన్లున్నందున 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేస్తారు. గజ్వేల్‌లో 322 పోలింగ్ స్టేషన్లు ఉన్నందున 23 రౌండ్లు, పటాన్‌చెరులో 411 పోలింగ్ స్టేషన్ల ఓట్ల లెక్కింపుకు అదనపు రౌండు పట్టనుంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోనూ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. ఒక్కో సెగ్మెంట్ ఓట్లను ఒక్కో గది చొప్పున ఏడు గదుల్లో లెక్కిస్తారు. ఒక్కో గదిలో 14 టేబుల్స్ ఉంటాయి. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 1973 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1225049 ఓట్లు పోలయ్యాయి. జుక్కల్‌లో 255, బాన్సువాడలో 258, కామారెడ్డిలో 266 పోలింగ్ స్టేషన్లు ఉన్నందున వీటిల్లో 19 రౌండ్లలోనే లెక్కింపు పూర్తికానుంది. ఆందోల్‌లో 313, జహీరాబాద్‌లో 313 పోలింగ్ స్టేషన్లు ఉన్నందున ఇక్కడ 23 రౌండ్ల వరకు లెక్కింపు కానుంది. నారాయణఖేడ్‌లో 298, ఎల్లారెడ్డిలో 270 పోలింగ్ స్టేషన్లు ఉన్నందున ఇక్కడ 22 రౌండ్లవరకు లెక్కింపు కానుంది.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్లను జూన్ 4న లెక్కించేందుకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. మెదక్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్, జహీరాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరు పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తున్నారు. మెదక్ నియోజకవర్గ ఓట్లను నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ, ప్రభుత్వ కళాశాలలో లెక్కిస్తారు. ఇందు కోసం అవసరమైన సిబ్బందికి మొదటి దశలో శిక్షణ ఇచ్చారు. జూన్ 3న కూడా మరో సారి లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు శిక్షణ ఇస్తారు. జూన్ 4న ఉదయం 6 గంటలకే సిబ్బంది కౌంటింగ్ హాల్‌సలో సిద్ధంగా ఉంటారు. మొదట పోస్టల్ బ్యాలెట్లను తెచ్చి టేబుల్స్‌పై లెక్కిస్తారు. ఆ తర్వాత ఈవీఎంలను పోలింగ్ స్టేషన్ల వారిగా తెచ్చి లెక్కిస్తారు. స్ట్రాంగ్ రూంల్లోంచి ఈవీఎంలను తెచ్చేందుకు ప్రత్యేకంగా సిబ్బంది ఉంటారు. టేబుల్స్‌పై సూపర్‌వైజర్లు, సహాయకులు అభ్యర్థుల తరపున వచ్చినన కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో సీల్స్ చూపించి విప్పుతారు. ఆ తర్వాత ఏ అభ్యర్థికి ఎన్నిక ఓట్లు వచ్చాయనేది లెక్కిస్తారు. అలా రౌండ్ల వారిగా లెక్కింపు చేసేందుకు అవసరమైన సిబ్బంది, ఇతర ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ హాల్స్ వద్ద విద్యుత్ కోతలుండకుండా జాగ్రతలు తీసుకున్నారు.



భారీ పోలీస్ బలగాల మోహరింపు

ఓట్ల లెక్కింపు ప్రక్రియంతా ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసులతో బందోబస్తే ఏర్పాటు చేశారు. అలాగే కౌంటింగ్‌కు అదనపు పోలీసు బందోబస్తు ఉంటుంది. కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని పోలీస్ బలగాలు గీతం యూనివర్సిటీ వద్ద బందోబస్తు ఉంటుంది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాకు చెందిన పోలీసులు నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ, ప్రభుత్వ కళాశాల వద్ద బందోబస్తు నిర్వస్తారు. ఓట్ల లెక్కింపులో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా నిఘా పెట్టారు. ఓట్ల లెక్కింపు తర్వాత కూడా కోడ్ అమల్లో ఉంటున్నందున ఊరేగింపులు, సభలు, సమావేశాలకు అనుమతి ఉండదు. జిల్లాల ఎస్పీలు, కమీషనర్లు బందోబస్తును పర్యవేక్షించనున్నారు.

చిన్నారి వైద్యం కోసం రూ.20వేల ఆర్థిక సహాయం



నవతెలంగాణ-సిద్దిపేట

నాలుగు నెలల చిన్నారి ఊపిరితిత్తులలో, మెదడులో వచ్చిన ఇన్ఫెక్షన్ తొలగించడానికి వైద్యం కోసం రూ 20 వేల ఆర్థిక సహాయం అందించినట్లు ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ చక్రధర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన మౌనిక కుమారుడు బాబు వెంకటేష్‌కి (4 నెలలు) ఊపిరితిత్తులలో, మెదడు లోపల ఇన్ఫెక్షన్‌తో సిద్దిపేట శిశు రక్ష ఆసుపత్రిలో ప్రాణపాయ స్థితిలో ఉన్నాడని, నిరుపేద కుటుంబం వల్ల హాస్పిటల్ బిల్లులు కూడా కట్టలేని నిస్సహాయ పరిస్థితిలో వారు ఉన్నారని తెలుసుకొని ఆసుపత్రి ఖర్చుల నిమితం రూ 20వేలు సహాయం అందించినట్లు తెలిపారు.

ఎమ్ఎస్ఎంఈ సిద్దిపేట జిల్లా డైరెక్టర్‌గా గువ్వ మహేష్



నవతెలంగాణ-సిద్దిపేట

సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎంఈ) ప్రమోషన్ కౌన్సిల్ ఇండియా సిద్దిపేట జిల్లా డైరెక్టర్‌గా గువ్వ మహేష్ నియమించబడ్డారు. శుక్రవారం మహేష్ మాట్లాడుతూ ఎమ్ఎస్ ఎంఈ చైర్మన్ విజయ్ కుమార్ తనకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

కవయిత్రి ఉమారాణికి సన్మానం



నవతెలంగాణ-సిద్దిపేట

తెలుగు భాష చైతన్య సమితి, గోల్కొండ సాహితి కళాసమితి వారి ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్న సిద్దిపేటకు చెందిన కవయిత్రి ఉమారాణిని నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో జాతీయ స్థాయి కవి సమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. సన్మానం పొందిన ఉమారాణిని శ్రీ వాణి సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు, కార్యవర్గం అభినందనలు తెలిపారు.

ఘనంగా హజ్రత్ ఖాజా బందనవాజ్ ఉర్సు ఉత్సావాలు



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో శుక్రవారం 85వ ఉర్సు ఉత్సవాలను దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహేబ్ నిర్వహించారు. గత 85వ సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో కుల మతాలతకతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొంటున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరించారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్ ఇంటి నుంచి తీసుకొని దర్గాలోకి తీసికెళ్లే కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. శనివారం ఉదయం కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం నాతే మై ఫీల్ సమ ఉంటుదన్నారు. రాత్రి అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులు రిమాండ్

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ తరలించినట్లు సిద్దిపేట ఏసిపి మధు తెలిపారు. ఈ నెల 28వ తేదీన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో హనుమాన్ మాల వేసుకున్న వ్యక్తులు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో పూజలు చేసుకునేందుకు వెళుతుండగా ఎస్సీలు గుడిలోకి రావద్దు అంటూ అడ్డుకున్న ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీబీ జీ మధు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయగా సిద్దిపేట ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి చందన నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పచ్చిరొట్టె విత్తనాల కొరత తీర్చాలి

- సగం మందికి కూడా విత్తనాలు అందలేదు
- ఆందోళనలో అన్నదాతలు
- మూడ్రోజుల్లో ప్రతీ రైతుకు పచ్చి రొట్టె
- విత్తనాలను అందజేస్తాం : ఏవో చైతన్య



విత్తనాలను సరఫరా చేయాలని కోరుతున్నారు.

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల పరిధిలో రైతులకు పచ్చిరొట్టె విత్తనాలను తగిన సమయంలో అందించకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ ద్వారా రెండ్రోజుల క్రితం రైతులకు జీలుగు, జనుము విత్తనాలు పంపిణీ చేశారు. అయితే ఆ విత్తనాలు కేవలం సగం మంది రైతులకి అందడంతో మిగిలిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోహిణి కార్తె దగ్గర పడుతు న్నదని.. విత్తనాలను ఇప్పటికే పొలాల్లో చల్లాల్సి ఉన్నప్పటికీ పచ్చిరొట్టె విత్తనాల కోసం ఇప్పటివరకు వేచి చూశామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మండల వ్యవసాయ అధికారులు స్పందించి రైతుల పట్ల శ్రద్ధ వహించి సకాలంలో ఆయా

పై అధికారులకు నివేదికలు పంపించాం

- చైతన్య, మండల వ్యవసాయ అధికారి

స్థానికంగా పచ్చిరొట్టె విత్తనాలు సరఫరా చేయడంలో కాసింత జాప్యం జరిగిన మాట వాస్తవమే. రైతులకు సరిపా విత్తనాలు రాకపోవడంతో.. చాలామంది విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని మా పై అధికారులకు నివేదికలు పంపించాం. పుల్కల్ ఉమ్మడి మండలానికి రైతులకు సరిపడే జీలుగు, జనుము విత్తనాలను పంపించాలని కోరా. కావున రైతులు ఓపికతో ఉండాలి. రెండు లేదా మూడు రోజుల్లో విత్తనాలు రాగానే రైతులు తీసుకెళ్లాలి.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి వై.జ్ఞాన మంజరి అన్నారు. అలాగే బడిబాట జయప్రదం చేసి విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచుదాం అని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశాన్ని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 12తో విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పాఠశాలలను అన్ని రకాల సౌకర్యాలతో తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు-పదోన్నతుల గురించి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4 డియర్‌నెస్ అలవెన్స్‌లు వెంటనే ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి ముందుగా తాత్కాలిక ఉపాధ్యాయులు (విద్యా వాలంటీర్లను) నియమించాలన్నారు. డీఎస్సీ ద్వారా కొత్త రిక్రూట్మెంట్ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్‌కు అనుగుణంగా ఉపాధ్యాయులంతా బడిబాట కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచుకోవాలని టీఎస్ యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూ టీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే.అశోక్, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ఉపాధ్యక్షులు జే.కాశీనాథ్, కోశాధికారి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు ఎం.శామయ్య, ఎం.నరేష్, బి.సాయితేజ, బి.అరుణశ్రీ, ఏ.జగన్మోహన్, ఎండి. సమయుద్దిన్, చందర్ రాథోడ్, వి. అనురాధ, సిహెచ్. కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై జిన్నారం మండల సభ ఆగ్రహం

పలు అంశాలపై వాడీవేడిగా చర్చ

నవతెలంగాణ-జిన్నారం



జిన్నారం మండల సర్వసభ్య సమావేశం అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. శుక్రవారం జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మతోని రవీందర్ గౌడ్ అధ్యక్షతన సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చాలా ప్రభాకర్, ఎంపీఓ సంతోష్ కుమార్ సమక్షంలో మండల సర్వసభ్య సమావేశం రైతన్నల రుసరుసలు, వివిధ సమస్యలపై అంశాలవారీగా అధికారులపై సభ్యుల ఆగ్రహంతో కొనసాగింది.

సభలో వ్యవసాయ అంశంపై అగ్రికల్చర్ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి వివిధ అంశాలను సభకు వివరించారు. ఇంతలో సభ్యులు వెంకటేశం గౌడ్ తదితరులు రుణమాఫీ ఏమయ్యింది? క్వింటాలకు 500 సంగతేంటి బ్యాంకు క్రాఫ్ట్‌లోన్ల విషయమై ఇతర లోన్లు వచ్చినట్లయితే బ్యాంకు వాళ్ల క్రాఫ్ లోన్ల కింద డబ్బులు కట్టుకుంటామనడమేంటి అనే అంశాలపై చర్చ కొనసాగింది. దాంతో స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ రాజు నాయక్‌ను సమావేశానికి పిలిపించారు. రైతులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ప్రత్యే కంగా లోన్లు ఇచ్చినట్లయితే వాటిని అప్పు కింద జమ కట్టకుండా ఉండాలని మండల సర్వసభ్య సమావేశం సూచించింది. అలాగే అక్రమ మట్టి బాగోతం, అసైన్డ్ భూములను పరిశ్రమల పేరిట టీఎస్ ఐఐసీ నెపంతో కట్టబెట్టారన్న అంశంతో పాటు పలు విషయాలు వాడీవేడీగా చర్చించారు. అదేవిధంగా సంబంధిత అధికారులు వారి శాఖలకు సంబంధించిన పనులు గురించి సభలో వివరించారు. కాగా అధికారులు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పరిష్కారం దిశగా స్పందించాలని ఎంపీపీ రవీందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్‌లు సూచించారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్ ,ఎంపీ ఓ సంతోష్ కుమార్, డాక్టర్ కోమల్ తారక్, సెక్రటరీలు గడ్డపోతారం వెంకట్, జిన్నారం లక్ష్మీకాంత్ రెడ్డి, మండల సెక్రటరీల బృందం, కో ఆప్షన్ నెంబర్ ఇంతియాజ్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంపై అవగాహన



నవతెలంగాణ-న్యాల్‌కల్

జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు పున ప్రారంభం కానుండ్నడంతో ఎంపీడీవో కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మెన్లు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, ఎంఈఓ, ఐకెపి, సిఆర్పి అధికారులతో సమన్వయ కమిటీ కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సమావేశం జరిగినట్టు మండల విద్యాధికారి మారుతి రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ భూపాల్ , ఎంఈఓ మారుతీ రాథోడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూన్ 3 నుంచి 19 తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్యను పెంచడం , బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఉచితంగా నోటు పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందుతుందని వారి తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై రాము నాయుడు, ఎంపీడీవో సురేష్, ఏపీఎం కుమార్, సిఆర్పిలు ఆయా అధికారులు ఉన్నారు.


ఆర్టీసీలో నగేష్ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం భేల్ డిపోలో పనిచేస్తున్న గడీల నగేష్ సేవలు అభినందనీయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అన్నారు. సాయిజ్యోతి నగర్ కాలనీలో గల భేల్ బస్సు డిపోలో 34 ఏండ్ల ఆర్టిసిలో మెకానిక్‌గా పని చేసి సేవలు అందించిన గడీల నగేష్ పదవీవిరమణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్ పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీలో నగేష్ అందరి మన్ననలు పొందుతూ ఎన్నో ఏండ్లుగా ఉద్యోగంలో మంచి పనితీరును ప్రదర్శించారన్నారు. అంకితభావంతో పనిచేసిన ఆయనను పలువురు ఈ సందర్భంగా అభినందించి సన్మానించారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూరుగడ్డ పుష్పనగేష్‌ను సన్మానించారు.వారితో డిపో మేనేజర్ సుధాకర్, మొగులయ్య, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నెంబర్ ఒక్కటి ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. వికారాబాద్ రైల్వే కానిస్టేబుల్ దీపక్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించగా.. మృతుని వయస్సు అందాజా 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుని శరీరంపై ముదురు ఎరుపు రంగు ఫుల్ షర్ట్, ముదురు బూడిద రంగు ప్యాంటు, కుడి పక్క ఎముకలపై ఒక పుట్టుమచ్చ, ఛాతీ ఎడమ వైపున ప్రేమ చిహ్నమైన పచ్చబొటు ఉన్నాయన్నారు. మృతుడి వద్ద మరే ఇతర ఆధారాలు లేవని తెలిపారు. ఈ శవాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో మూడ్రోజుల వరకు భద్రపరుస్తారన్నారు. మృతుడి గురించి ఆచూకీ తెలిసినవారు రైల్వే పోలీస్ స్టేషన్, వికారాబాద్ ఫోన్ 8712658587కు సమాచారం అందించాలన్నారు.

భేల్ బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-రామచంద్రాపురం

భేల్ బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్టు సంస్థ ప్రాంతీయ నిర్వాహకురాలు బీ కె నిర్మల బెహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో 10 నుండి 16 ఏండ్ల వయసు గల బాల బాలికలు పాల్గొనవచ్చునన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి 11గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో బాల బాలికల మానసిక, శారీరిక వికాసం కోసం కావలసిన అన్ని రకాల కార్యక్రమాలు నిష్ణాతులైన అనుభవం కలిగిన వారితో నిర్వహింపబడతాయన్నారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అందోల్‌లో ఘనంగా రథోత్సవం

హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహా



నవతెలంగాణ-జోగిపేట

శ్రీ రంగనాథ స్వామి దేవాలయం జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలులో భాగంగా శ్రీ భూ నీలా సమేత రంగనాథ స్వామీ, మురళీ కృష్ణుల రథోత్సవం కార్యక్రమం శుక్రవారం రాత్రి నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దంపతులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవ ఊరేగిం పును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

సీతారాంపల్లి ఘటనపై మాజీ మంత్రి స్పందించాలి

ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

సీతారాం పల్లి గ్రామ సంఘటన విషయంపై మాజీ మంత్రి స్పందించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారాంపల్లి గ్రామ సంఘటన ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలకు చెందిన కొంతమంది వ్యక్తులు హనుమాన్ మాల వేసి గుడిలోకి ప్రవేశిస్తే మీకు అనుమతి లేదు, మీ తాతలు, తండ్రులు ఎవరు కూడా ఈ గుళ్లోకి రాలేదు కాబట్టి మీరు కూడా ఈ గుడిలోకి రావద్దు, ఒకవేళ రావాలి అనుకుంటే మీ కులాన్ని మార్చుకొని రండి అని అవమానపరిచిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీతారాంపల్లి గ్రామంలో పదేళ్ల తెలంగాణను పరిపాలించి, సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన తన్నీరు హరీశ్‌రావు స్పందించకపోవడం దారుణమన్నారు. సీతారాంపల్లిలో కులాల పేరు మీద ఇంత వివక్ష జరుగుతున్న దానిని నిర్మూలించకుండా, తనకు ఎలాంటి సంబంధం లేదన్నట్టు ఘటనపై మౌనంగా ఉన్నారని, మాజీ మంత్రి హరీశ్‌రావు వెంటనే ఈ ఘటనపై స్పందించాలన్నారు.వెంటనే స్పందించి దోషులను శిక్షించే విధంగా చూడాలని సంజీవ్ కుమార్ కోరారు.

నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

నవతెలంగాణ-సంగారెడ్డి



శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు (జూన్ 1వ తేది నుండి 30 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు వారికి సహకరించాలని సూచించారు. అనుమతి లేకుండా.. పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఫర్టిలైజర్ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

నవతెలంగాణ-కోహిర్



మండలంలోని కావేలి ఎక్స్‌రోడ్ వద్ద గల ఫర్టిలైజర్ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లూజు విత్తనాలను విక్రయించినా.. నిల్వ ఉంచినా డీలర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాల స్టాకు వివరాలు దుకాణంలో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు. ధర పట్టికలో ఎప్పటికప్పుడు వివరాలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, స్థానిక ఎస్సై కృష్ణ, తహసీల్దార్ శంకర్, ఏఈవోలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



తడిసిన జొన్నలను కొనుగోలు చేయాలని ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-రాయికోడ్

తడిసిన జొన్నలను కొనుగోలు చేయాలని సర్వసభ్య సమావేశం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో మం డల పరిషత్ అధ్యక్షులు సిరిగాపురం మొగులప్ప ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో.. ఇటీవలే అకాల వర్షానికి దెబ్బతిన్న పంటను సీసీఐ ద్వారా కొనుగోలు చేసి రైతులకు నష్టం వాటిల్లకుండా రైతులను ఆదుకోవాలని సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో అధికారులు నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని కుళాయిల వద్ద మరమ్మత్తులు చేపట్టి ప్రజలు అనారోగ్య బారిన పడ కుండా చూడాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది కాబట్టి విద్యా శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షరీ ఫ్, స్థానిక ఎస్సై వెంకటరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ విజయకుమార్, వైస్ ఎంపీపీ మమత అశోక్, ఎంపీటీసీలు శివకుమార్, పండరి, శంకరమ్మ, మండల వ్యవసాయ అధికారి అవినాష్ వర్మ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండానే సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు



నవతెలంగాణ-జహీరాబాద్

అనుమతుల్లేకుండా సీబీఎస్ఈ పేరుతో శ్రీ బీబీఏ జయింట్ హై స్కూల్ 'అడ్మిషన్లు తీసుకుంటున్నదని.. వెంటనే ఆ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలోని శ్రీ బీబీఏ జయింట్ హై స్కూల్ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పర్మిషన్ లేకుండానే సిబిఎస్ పేరుతో ఇష్టానుసారంగా ప్రచార ఆర్భాటాలు చేస్తూ అడ్మిషన్లు దండుకుంటున్నదని ఆరోపించారు. వెంటనే ఆ యజమాన్యంపై చర్యలు తీసుకుని.. పాఠశాలను సీజ్ చేయాలన్నారు. సీబీఎస్ఈ స్కూల్ పెట్టాలంటే కొన్ని పరిమితులు ఉంటాయని.. కానీ వాటిని పట్టించుకోకుండా విద్యార్థులను ఈ పాఠశాల మోసం చేస్తున్నదన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్కూల్ పై చర్యలు తీసుకొని లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్, మల్లేష్, మనోజ్,పృథ్వీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలో బ్రాహ్మణ సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా మని జహీరాబాద్ తాలూకా అధ్యక్షులు రాజ్ కుమార్ దేశ్ పాండే అన్నారు. రేజింతల్ సిద్ధి వినాయక ఆలయంలో బ్రాహ్మణ సమాజ సేవా సంస్థ ముఖ్య కార్యవర్గ తాలుకా అధ్యక్షుడు రాజ్‌కుమార్ దేశ్పాండే, ప్రధాన కార్యదర్శి బాల చందర్ జోషి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవా సంస్థ కార్యవర్గం అధ్యక్షులుగా సతీష్ కులకర్ణి, ప్రధాన కార్యదరిృగా మోహన్‌జోషి, ఉపాధ్యక్షులుగా ప్రకాష్‌జోషి, కార్యవర్గసభ్యులు ఎన్నుకున్నారు.

విశ్వనందగిరి ఆశ్రమంలో వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

విశ్వనందగిరి ఆశ్రమంలో శుక్రవారం నుంచి ఈనెల 2 తేదీవరకు మూడ్రోజుల పాటు జరుగుతున్న విశ్వనాథ దత్తాత్రేయ నాగదేవత ఆంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని న్యామతాబాద్ విశ్వనందగిరి మహారాజ్ అన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ రోజు సాయంత్రం భజన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

గుర్తింపు లేనిస్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



అనుమతుల్లేకున్నా సీబీఎస్ఈ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేపడుతున్న పల్లవి స్కూల్ యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దాదాపు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ పట్టణంలోని పల్లవి స్కూల్.. సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. పల్లవి స్కూల్ యాజమాన్యం పైన ఉన్నత అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఈఓ ప్రయివేటు స్కూల్ యజమాన్యానికి తొత్తుగా మారినట్టు ఆయన వైఖరి ఉన్నదని ఆరోపించారు. ధర్నా వద్దకు వచ్చిన ఎంఈఓ.. అడ్మిషన్లు తీసుకుంటున్నారని కూడా ఎంక్వయిరీ చేయలేకుండా అక్కడి నుండి వెళ్లిపోయాడని మండిపడ్డారు. సదరు ఎంఈఓపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, చంద్రశేఖర్, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల కేంద్రంలోని ముంగి, న్యాల్‌కల్, గంగ్వార్, చౌరస్తాలో గల ఫర్టిలైజర్ దుకా ణాల్లో ట్రాస్క్‌ఫోర్స్ అధికారులు తహసీల్దార్, ఎస్సై, ఏవోతో కలిసి శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వలను, పత్తి ప్యాకెట్లను పరిశీలిం చారు. నిబంధనల ప్రకారమే ఎరువులు విత్తనాలు విక్రయించు కోవాలన్నారు. నకిలీ విత్తనాల అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ భూపాల్, హద్నూర్ ఎస్సై రాము నాయుడు, మండల ఏఓ లావణ్య ఫర్టిలైజర్ డీలర్లు ఉన్నారు.

ముగిసిన వేసవి యోగా శిక్షణ శిబిరం

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని గంగారం ఉన్నత పాఠశాలలో మే ఒకటో తేదీన ప్రారంభమైన వేసవి యోగా శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయని యోగా శిక్షకులు విజయ్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ప్రతిరోజు ప్రాణాయామం వివిధ రకాల ఆసనాలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో 44 మంది విద్యార్థులు యోగాసనాలు నేర్చుకున్నారని విజయకుమార్ తెలిపారు.

చెరువు భూమికే ఎసరు



- జాతీయ రహదారికి అనుకుని ఉండడంతో కబ్జాకు కుట్రలు
- కోట్ల విలువైన భూమిని కాజేయాలని ఇప్పటికే కంచె ఏర్పాటు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పలు గ్రామాల ప్రజలు
- ఉద్యమానికి సిద్ధమవుతున్న జనం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండలంలో గల చింతల్‌ఘట్, కావేలి గ్రామాల పరిధిలోని 34 ఎకరాల చెరువు భూమిని ఒక ప్రైవేటు కంపెనీకి చెందిన వారు కబ్జాకు పాల్పడుతు న్నారని కుట్రలు చేస్తున్నారు. అందులో భాగంగా ఇటీవలే చెరువు తూము వరకు కంచె కూడా వేశారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు వరద నీటితో ఈ చెరువు నిండి.. వ్యవసాయ భూములతో పాటు చుట్టుపక్కల ఉన్న అనంత సాగర్, చింతల్గట్, కవేలి, వెంకటాపూర్, ఏడాకులపల్లి గ్రామాలలో భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి. ఉమ్మడి రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు నాడు ఈ చెరువులో పూడిక తీసి భూగర్భ జలాలను అభివృద్ధి చేయాలని నిధులు సైతం మంజూరు చేశారు. అలాంటి ఈ చెరువుపై నేడు కబ్జాకోరుల కన్ను పడింది. 65వ జాతీయ రహదారికి ఈ చెరువు ఆనుకుని ఉండడంతో.. ఈ భూమికి కోట్ల రూపాయలు పలుకుతున్నది. దాంతో ఓ ప్రయివేటు కంపెనీ వారు ప్రజాప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై ఈ భూమికి కబ్జాకు కుట్రలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎట్టి పరిస్థితిల్లోనూ చెరువును కబ్జా కానివ్వబోమని.. ఉద్యమాలకు కూడా సిద్ధమవుతున్నట్టు చెప్పారు.

సర్వే చేపట్టి.. చర్యలు తీసుకుంటాం

కోహిర్ మండలంలోని చింతల్గట్, కవేలి గ్రామాల పరిధిలో గల చెరువులో అక్రమంగా ఫినిషింగ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చింది తక్షణమే రెవెన్యూ ఇరిగేషన్ శాఖల అధికారులతో సర్వే నిర్వ హించి చర్యలు చేపడతామని ఆర్డిఓ రవీందర్ అన్నారు.

- రవీందర్, ఆర్డీవో

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని చింతలగట్టు గ్రామంలో గల గుండం చెరువు 65వ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నది. ఇక్కడ సహజంగానే భూమి విలువ ఎకరా రూ.6 నుంచి 8కోట్ల వరకు పలుకుతోంది. కవేలి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 24లో మొత్తం 26 ఎకరాల 22 గుంటల భూమి ఉండగా, అందులో చెరువులో 9 ఎకరాల 30 గుంటలు ఉన్నది. ఇక సర్వే నంబర్ 25లో మొత్తం 22 ఎకరాల33 గుంటలు ఉండగా ఈ భూమి మొత్తం చెరువు శిఖంలోనే ఉన్నది. ఇక చింతలగట్టు గ్రామా నికి సంబంధించిన సర్వే నంబర్‌లు 114, 113లో భూమి శిఖంలో ఉండగా ఇందులో సర్వే నంబర్ 113 లోని మొత్తం 21 ఎకరాల 34 గుంటల భూమి లో కేవలం 2 ఎకరాల27 గుంటలు మాత్రమే కొంతమంది రైతులకు గతంలో కేటాయించారు. సర్వే నంబర్ 114లోని 6 ఎకరాల 4 గుంటలు భూమి మొత్తం చెరువు శిఖంలో ఉన్నది. అయితే శిఖం భూమిలో ఏ విధమైన నిర్మాణాలు కానీ కబ్జాలు కానీ చేసే అర్హత ఎవరికి ఉండదు. నీళ్ల లేని సమయంలో అందులో రైతులు పంట మాత్రం సాగు చేసుకోవచ్చు. కానీ నేడు చెరువు తూము వరకు కబ్జాదారులు కంచెవేయడంతో గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. గత కొన్ని రోజులుగా ఎండలు తీవ్రమవడంతో చెరువులో నీళ్ల మొత్తం ఎండిపోయాయి. అధికారులు ఎన్నికల్లో బిజీ అయిపోవడం, గ్రామస్తులు అటు వైపు చూడకపో వడంతో ఇదే అదు నుగా ఓ ప్రైవేట్ కంపెనీ యాజ మాన్యం, నీటి పారుదల శాఖ, సర్వే అధికారులు కలిసి ఈ కబ్జా కార్యక్రమానికి శ్రీకా రం చుట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే కంచెను తొలగించి తమ గ్రామ చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే కబ్జా..



ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చెరువు కబ్జాకు గురైనట్టు మా దృష్టికి వచ్చింది. మండల సర్వేయర్, ఆర్ఐలను పంపి విచారణ జరిపి స్తాం. ఆ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటాం.

- బాల శంకర్, కోహిర్ మండల తహసీల్దార్

'నో ఆబెక్షన్' సర్టిఫికేట్ ఎలా జారీ చేశారో..



ఇక ఇరిగేషన్ శాఖ అధికారులు జిల్లా స్థాయి అధికారులు నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను ఏ ఆధారంగా జారీ చేశారో, ఏమని జారీ చేశారో ఎక్కడ రికార్డులు లేవు. సంబంధిత ఫైల్ కూడా లేకపోవడం మరో విచిత్రం. అసలు ఇరిగేషన్ శాఖ అధికారులకు తమ చెరువు అని తెలుసో లేదో, పోతే పోనీ అనుకున్నారో అర్థం కావట్లేదు. ఇంతగా ఆరోపణలు వస్తున్నా ఎఫ్‌టిఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) ను ఫిక్స్ చేయకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

-రాజు, వెంకటపూర్ గ్రామస్తుడు

కబ్జా విషయం నాకు తెలియదు



ఈ కబ్జా గురించి మాకు తెలియదు. దీనిపై తహసీల్దార్‌కు లేఖ ఇచ్చి, నివేదికను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు చేపడతాం.

- రవీందర్, ఇరిగేషన్ ఏఈ

రెండ్రోజుల్లోగా ఫెన్సింగ్ తొలగించాలి



వర్షాకాలంలో ఈ చెరువుల్లో నీరు నిండా ఉండడంతో.. చుట్టూ పక్కల వ్యవసాయ భూములకు ఎలాంటి ఇబ్బంది ఉంకపోయేదు. నీరు రాకుండా అడ్డుకట్టలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారి కి దగ్గరగా ఉండటంతో, భూముల ధరలు పెరగడంతో అకమార్కుల కన్ను ఈ చెరువుపై పడింది. రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. రెండ్రోజుల్లోగా చెరువులో వేసిన ఫెన్సింగ్‌ను తీసి వేయకపోతే ప్రజలతో, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తాం.

-సుధీర్ కుమార్, చింతల్‌ఘాట్ గ్రామస్తులు

ఉద్యోగ జీవితంలో పదవి విరమణ సహజం

జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



ఉద్యోగ జీవితంలో పదవి విరమణ అనేది సహజం అని జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ అన్నారు. శుక్రవారం పదవి విరమణ పొందుతున్న ఎస్ఐ ఇ.వి.రమణకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. 1986లో పోలీసు శాఖలో పోలీసు కానిస్టేబుల్ నియామకమై, గడిచిన 39 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో జనరల్ డ్యూటీలు, స్టేషన్ రైటర్‌గా, విధులు నిర్వహించి, అధికారుల మన్ననలు పొందారని, సర్వీస్ మొత్తంలో ఎ చిన్న రిమార్క్ లేకుండా వారు అందించిన ఉత్తమ సేవలకు గాను అంచలంచాలుగా పదోన్నతులు పొందుతూ.. సబ్-ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారన్నారు. వారు పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావాల్సిన అన్నిరకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందే విధంగా చూస్తామన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నానన్నారు. పోలీస్ శాఖ తరపున వారికి, వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, సూపరింటెండెంట్స్ అశోక్, వెంకటేశం, యస్.బి ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఆర్ఐ. రాజశేఖర్‌రెడ్డి, హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తారా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తారా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. గాయత్రి దేవి హాజరై మాట్లాడుతూ.. పొగాకు వల్ల నోటి సంబంధ క్యాన్సర్లు, ఊపిరితిత్తి క్యాన్సర్, అల్సర్లు, గుండె సంబంధించిన వ్యాధులు, రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్, సంతాన వైఫల్యం, చిన్న పిల్లలలో అనేక రకాల శ్వాస సంబంధ ఇబ్బందులు లాంటివి వస్తాయన్నారు. సిగరెట్, గుట్కా, పాన్ జెర్దా మసాలా ఎటువంటిదైనా సరే ప్రమాదకరమన్నారు. కౌన్సెలింగ్ ద్వారా కూడా పొగాకును మానేయవచ్చు అన్నారు. అవసరమైన వారికి ఉచితగానే చికిత్స కూడా అందజేస్తారన్నారు. గర్భిణీ స్త్రీలు ఎట్టి పరిస్థితుల్లో పొగాకు ఉత్పత్తులను వాడొద్దన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 56 నోటి క్యాన్సర్ 11 ఊపిరితిత్తుల క్యాన్సర్లు గుర్తించడం జరిగిందన్నారు. అందుకే బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చట్ట రీత్యా నేరమన్నారు. యాక్టివ్ స్మోకింగ్ ఎంత ప్రమాదమో ప్యాసివ్ స్మోకింగ్ కూడా అంతే ప్రమాదమన్నారు. కావున రాబోవు తరాలకు పొగాకు సంబంధిత వ్యాధులు రాకుండా ఉండాలంటే పొగాకు ఉత్ప త్తుల్ని వాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్న ప్రసాద్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శశాంక్ దేశ్ పాండే, వైద్యాధికారులు డాక్టర్ శశికర్, డాక్టర్ ప్రేమామృతం, సిహెచ్. లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న కూరగాయల మార్కెట్

- పట్టించుకోని గ్రామ కార్యదర్శి
- దుర్వాసన భరించలేక ప్రజల ఉక్కిరిబిక్కిరి

నవతెలంగాణ-పుల్కల్





మండల కేంద్రంలో ప్రతీ శనివారం జరిగే కూరగాయల సంతలో చెడిపోయిన కూరగాయలను వ్యాపారస్తులు ఎక్కడి వక్కడే పారబోయడంతో వాటి నుండి వచ్చే దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఏమాత్రం పట్టించుకోవట్లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అనునిత్యం ఆయా గ్రామాల నుంచి ప్రజలు రోజువారి కూరగాయల కోసం పుల్కల్ మండల కేంద్రానికి వస్తుంటారు. అయితే ఇక్కడి మార్కెట్లో చెడిపోయిన కూరగాయలు కుప్పల నుంచి భరించలేని దుర్వాసన వస్తుండడంతో.. చాలా మంది కూరగాయలు కొనకుండానే వెనుతిరుగుతున్నారని కూరగాయల వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. తమ వద్ద ప్రతీ వారం వారం తై బజార్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లు మార్కెట్ యార్డ్ ను శుభ్రం చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ విషయమై నవతెలంగాణ రిపోర్టర్ గ్రామ కార్యదర్శికి పదిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.

ఈదమ్మ జాతర ప్రారంభం

నవతెలంగాణ-ఝరాసంగం



మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో ఈదమ్మ (గ్రామ దేవత) జాతర బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే గ్రామ దేవతకు అభిషేకం, నైవేద్యం సమర్పించి గ్రామ శివారులోని గంగ దేవతకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. సాయంత్రం ఆడపడుచులు బోనాలను చక్కగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం ఉదయం గ్రామ పురవీధుల్లో నుండి ఎడ్ల బండ్లను ఊరేగించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసారు. మళ్లీ ఆదివారం ఉదయం ఎడ్ల బండ్లను ఊరేగించి గ్రామంలోకి తీసుకెళ్తారు. ఈ జాతరకు చుట్టుపక్కల ప్రాంతాలనుండే కాకుండా కర్ణాటక మహారాష్ట్ర నుండి భక్తులు రానున్నారు. ఆలయంలో రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ విత్తన దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ పెస్టిసైడ్ సీడ్ దుకాణాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ చౌహాన్ తో కలిసి అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని మరువెల్లి, బిజిలిపూర్ గ్రామాల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తూ రికార్డులను పరిశీలించారు. రైతులకు ఏ కంపెనీలు ఉత్పత్తి చేసిన విత్తనాలను విక్రయిస్తు బిల్లులో నమోదు చేసి రసీదు అందజేయాలన్నారు. అనుమతులు లేని కంపెనీల సీడ్స్ ను విక్రయిస్తున్నట్లు తేలితే లైసెన్సును రద్దు చేయడమే గాక చట్ట ప్రకారం కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలను ఎరువులను విక్రయించే ధరల పట్టికను తప్పకుండా దుకాణంలో అందరికీ కనిపించేలా పెట్టాలన్నారు. తిరుమల తిరుపతి ఫర్టీ లైజర్ ఫెస్టిసైడ్ సీడ్ యాజమాని ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
శనివారం | 01 జూన్ 2024 | www.navatelangana.com

హొరాహొరిగా కుస్తీ పోటీలు




నవతెలంగాణ-పెద్దశంకరపేట్

పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు జాతర ను పురస్కరించుకొని శుక్రవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల మల్ల యోధులతో పాటు పరిసర మండల గ్రామాల ప్రజలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కుస్తీ పోటీలను తిలకించడానికి పేట మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాణిక్ ప్రభు దేవాలయంలో ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



నవతెలంగాణ-నార్సింగి

జూన్ ఒకటవ తేదిన శనివారం 33/11 కేవీ నార్సింగి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8:30 నుంచి 10:30 వరకు మరమ్మత్తులు నిర్వహించడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈసీహెచ్ స్వామి తెలిపారు. అందువల్ల నార్సింగి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పకడ్బందీ చర్యలు
- కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి
- 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సంబంధిత శాఖల సమన్వయం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ హాల్లో జిల్లాలోని మండల అభివృద్ధి అధికారులు, పంచాయితీ సెక్రటరీలతో బడిబాట కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి మౌలిక వసతులు కల్పించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉన్నదని, దానికి అనుగుణంగా పని చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపడుతున్న మౌలిక వసతులను పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలకు త్రాగునీరు, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్ మరుగుదొడ్ల మరమ్మతులు, మైనర్ రిపేర్లు, బాలికల పాఠశాలలో నూతన టాయిలెట్స్ నిర్మించడం జరుగుతుందన్నారు. జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ముఖ్యంగా 5 సంవత్సరాల పై బడిన పిల్లలను పాఠశాలలో జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీటన్నిటికీ ప్రణాళికలను రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు పరచాలని జిల్లా స్థాయి కమిటీ మండల స్థాయి గ్రామస్థాయి కమిటీల ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి బడి బయట ఉండడానికి వీలులేదని ప్రభుత్వ పాఠశాలలో వారిని జాయిన్ చేయించాలని చెప్పారు. అవకాశాలు అందిపుచ్చుకున్న వాళ్ళు ప్రతిభావంతులుగా విద్యాభ్యాసం కొనసాగించి భావిభారత పౌరులుగా సమాజంలో పేరొందుతారని తెలిపారు. వివోలతో సమావేశం, ఇంటింటి సర్వే, గ్రామ సభలు నిర్వహించడం పాఠశాలల వారీగా ప్రణాళిక రూపొందించడం రోజువారిగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటింట ప్రచారంలో భాగంగా వివరించి విద్యార్థుల నమోదు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు అవగాహన కార్యక్రమాలు దశలవారీగా అమలు చేయాలన్నారు. బడిబాట ఇంటింట సర్వేలో భాగంగా పదవ తరగతి పూర్తి చేసుకున్న పిల్లలపై దృష్టి సారించాలని వెంటనే వారిని ఇంటర్మీడియట్‌లో జాయిన్ చేయించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా ఉన్నత విద్యను అభ్యసించకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందన్నారు. విద్య గొప్పతనాన్ని వివరించాలని తెలిపారు. పదవ తరగతి పూర్తి చేయగానే ఆడపిల్లలకు తల్లిదండ్రులు అవగాహన లేక బాల్య వివాహాలు చేస్తారని, వాటిని అరికట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బడి బాటతో పాటు రానున్న వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమల వలన వచ్చే వ్యాధులు గురించి మలేరియా, డెంగ్యూ విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సుదర్శన మూర్తి, ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, పాల్గొన్నారు.

భూతగాదాల వల్ల ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-నిజాంపేట్

మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఏడు గంటల సమయంలో చింతాకుల స్వామి అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళ్తే రజాక్ పల్లి గ్రామంలో అన్నదమ్ములు చింతాకుల గుట్టయ్య, చింతాకుల స్వామిల మధ్య భూపంపకాల్లో వ్యత్యాసం ఏర్పడింది. దీంతో పలుసార్లు గ్రామస్తుల సమక్షంలో మాట్లాడుకున్నా పరిష్కారం కాకపోవడంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా ఇరువురు సమానంగా పంచుకోవాలని తెలపడంతో గ్రామ ప్రజల సహకారంతో గురువారం భూమి దగ్గర హద్దులు పెట్టుకోవడం జరిగింది. శుక్రవారం రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ ఉండడంతో ఉదయం తెల్లవారేసరికి స్వామి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు కులస్తులు, బంధువులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. న్యాయం జరిగేంత వరకు ఇక్కడి నుంచి వెళ్ళేది లేదని భీష్మించుకుని కూర్చోవడంతో అన్న అయినా గుట్టయ్యతో సంప్రదింపులు జరపడం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు కలిసి సమస్యను పరిష్కరించారు. మృతుని భార్య పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ చేస్తానని గుట్టయ్య ఒప్పుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

డాక్టర్ కృష్ణవేణిపై జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు



- న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం
- బాధిత కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట పట్టణంలోని సాయి కృష్ణ హాస్పిటల్‌లో ప్రసవం సమయంలో తల్లి, బిడ్డ మృతి చెందిన ఘటనపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ప్రసవ సమయంలో బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించి, తుడుం ఎస్తేర్(23) చావుకు కారణమైన డాక్టర్ కృష్ణవేణిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు వారు తెలిపారు. రామాయంపేట పోలీసులకు ఫిర్యాదు చేశామని, జిల్లా వైద్యశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఎస్తేరు చావుకు బాధ్యులైన వారికి చట్టపరంగా శిక్ష పడి, న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని వారన్నారు. ఈ కార్యక్రమంలో రామంచ బాలయ్య, కనకవ్వ, శ్వేత, దీవెన, మంద యాదగిరి, బాబు, అంజి, ప్రభాకర్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధి కోసమే ఈఓ మోహన్ రెడ్డి జీవితం



నవతెలంగాణ -పాపన్నపేట

దేవస్థానాల అభివృద్ధి కోసమే మోహన్ రెడ్డి జీవితం అంకితమైందని, ఆయన సేవలు అమోఘమని పలువురు వక్తలు కితాబు నిచ్చారు. శుక్రవారం ఈఓ మోహన్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఏడుపాయల్లోని గోకుల్ షెడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మోహన్ రెడ్డి ఉద్యోగ జీవితంలో నిరంతరం చేసిన పని తీరు అమోఘమన్నారు. ఈ సభకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా ఆలయాల చైర్మన్లు, డైరెక్టర్‌లు సిబ్బంది హాజరై వారి వారి సందేశాలను వ్యక్తం చేశారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖలో ప్రస్తుతం19 ఆలయాలకు ఈఓగా విధులు నిర్వహిస్తున్న మోహన్ రెడ్డి పదవి విరమణ కావడం దేవాదాయ శాఖకు తీరని లోటన్నారు. ప్రజా ప్రతినిధులను, పాలకమండలిని, సిబ్బందిని సమన్వయం చేస్తూ ఆలయ అభివృద్ధికి పాటుపడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆలయాల ఆదాయం పెంచి ఆలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. సమస్యలను తన సమస్యగా భావించి ఎంత పెద్ద సమస్యనైనా సునాయాసంగా పరిష్కరించే సౌమ్యుడన్నారు. ఉమ్మడి జిల్లాలలోని ఆలయాల సిబ్బంది, నాయకులు శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల చైర్మన్ సాతెల్లి నర్సింలు గౌడ్, మాజీ చైర్మన్ లుపార్శీ నర్సింలు గుప్తా, వెంకటేశ్వర్ రెడ్డి, పబ్బతి ప్రభాకర్ రెడ్డి, కె.నర్సింలు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోవింద్ నాయక్, ఎంపీటీసీలు ఆకుల శ్రీనివాస్, విజయేందర్ రెడ్డి, ఏడుపాయల పాలకమండలి ధర్మకర్తలు యాదగౌడ్, మనోహర్, పెంటయ్య, వెంకటేశం, సిద్ధిరాములు, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, టిఎస్ జిఓ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కందకం కుంటలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం




నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని కుంటలో గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యమైంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్ర పరిధిలోని జాతీయ రహదారి 44 పక్కన గల కందకం కుంటలో గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యమైంది. మృతురాలి వయస్సు 35-40 సంవత్సరాలు వరకు ఉంటుందని, పొడువు 5'1 ఉంటుందని తెలిపారు. మృతురాలు మల్టీకలర్ కుర్తా, ఎర్ర రంగు పైజామా వేసుకుందని, కుంట కట్ట పైన ఎర్ర రంగు లేడీస్ చెప్పులు లభించాయని వివరించారు. మృతదేహాన్ని పరిశీలిస్తే రెండు మూడు రోజుల క్రితం కుంటలో పడి మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్‌కు 8712657938, లేదా రామాయంపేట సీఐ వెంకటేశ్వర్లుకు 8712657933 సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

పోతంశెట్టిపల్లిలో పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్‌లు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వేద పండితులతో ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ పోతంశెట్టిపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి విగ్రహం నిలుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ గ్రామ ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గడ్డమీది శీను, పులబోయిన నర్సింలు, కొమ్ముల రాజు, బోల కిష్టయ్య, సదాల సతీష్, గడ్డమీది రాములు, పులబోయిన ప్రణీత్, మధు, కోటయ్య, బోల స్వామి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన కలిగి ఉండాలి

- వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్



నవతెలంగాణ-మెదక్

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో విత్తనాలు కొనే ముందు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించి బిల్లు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో కానీ, మండలంలో కానీ, జిల్లాలో కానీ లైసెన్సు ఉన్న డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు తీసుకోవాలని సూచించారు. పంట దిగుబడి వచ్చేవరకు లేదా పంట కాలం అయిపోయే వరకు బిల్లు రైతు దగ్గరనే భద్రపరుచుకోవాలన్నారు. తీసుకున్న బిల్ మీద విత్తన కంపెనీ పేరు విత్తన రకం బ్యాచ్ నెంబర్ లాట్ నెంబరు రేటు ఉండాలన్నారు. విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ చూసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో తక్కువ ధరకు తీసుకొచ్చి అమ్మే వారి వివరాలు తెలియజేయాలని సూచించారు. పక్క జిల్లా నుంచి పక్క రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ఎవరైనా నకిలీ విత్తనాలు, లూస్ విత్తనాలు అమ్మినచో తమకు తెలియజేయాలన్నారు. తొందరపడి లైసెన్స్ డీలర్ దగ్గర కాకుండా ఇతరుల దగ్గర విత్తనాలు తీసుకొని ఇబ్బంది పడొద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శ్రీ గంగా భవాని మాత దేవాలయ 36వ వార్షికోత్సవం



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలోని శ్రీ గంగాభవాని మాత దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. 36వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద పండితుల మధ్య ఆలయ ప్రాంగణంలో చండీస్ శర్మ, వంశీ శర్మల చేతుల మీదుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, స్థాపిత దేవతలకు అఖండ దీపారాధన, పంచామృత అభిషేకం,హెూమం అష్టోత్తర నామాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివుడికి, గంగాభవానికి కల్యాణ మహోత్సవ కన్నుల పండుగగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పట్టు వస్త్రాలు ఒడిబియ్యాలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహంకాళి దేవస్థానం ఆలయ ఈఓగా రవికుమార్



నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట మహంకాళీ దేవస్థానం ఆలయ ఈఓగా కందికోట రవికుమార్ నియామకమయ్యారు. 2001లో రామాయంపేట మహంకాళి దేవస్థానం ఆలయ మేనేజర్‌గా నియామకమైన మోహన్ రెడ్డి, ఆ తర్వాత ఈవోగా చార్జ్ తీసుకున్నారు. గత 23 ఏళ్లుగా రామాయంపేట మహంకాళి దేవస్థానంకు సేవలందించిన ఆయన పదవీ విరమణ పొందారు. సిద్దిపేట శరబేశ్వర ఆలయ ఈవోతో పాటు కోటిలింగాలు, కొండపోచమ్మ దేవాలయాలకు ఈఓగా ఉన్న కందికోట రవికుమార్ రామాయంపేట మహంకాళి దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట వీర హనుమాన్ టెంపుల్ జూనియర్ అసిస్టెంట్ చంద్ర ప్రకాష్, దేవాలయం చైర్మన్ సరపు పాండురంగ చారి పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన బిక్షపతి

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కని సిద్దిపేట అర్బన్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలిమి బిక్షపతి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి, గత పది సంవత్సరాలకు పైగా కష్టపడి బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొని, ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని, పోలీసు లాఠీ దెబ్బలు తిన్నామని తెలిపినట్లు తెలిపారు. పార్టీని కాపాడి, పార్టీ జెండాను భుజాన మోసిన పార్టీ కార్యకర్తలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ అధికార ప్రతినిధి దాస అంజయ్య, బాలకృష్ణ ముదిరాజ్, పరుశురాం, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మండలం అమ్మది పూర్ గ్రామం చెందిన వడ్ల నరేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. శుక్రవారం అమ్మదిపూర్ గ్రామంలో వడ్ల నరేష్ కుటుంబాన్ని పరామర్శించారు.మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకుపోయి ఆదుకుంటామన్నారు. అదే గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు నిజాముద్దీన్ తండ్రి మమ్మద్ నజీర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మమ్మద్ నజీర్ కృషి చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, సీనియర్ నాయకులు మద్ది రాజిరెడ్డి, చాడ శ్రీనివాస్ రెడ్డి, పాల రమేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు.హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ముత్యాల తలంబ్రాల పంపిణి

- నరేష్‌ను సన్మానించిన రామకోటి రామరాజు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్‌లోని హనుమాన్ భక్త మండలికి, పీర్లపల్లి గ్రామంలో హనుమాన్ భక్త మండలికి శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో భద్రాచల దేవస్థానం ముత్యాలను తలంబ్రాలను శుక్రవారం హనుమాన్ దేవాలయాల వద్ద భక్తులకు అందజేయడం జరిగింది. పీర్లపల్లి గ్రామం నుంచి కొడగట్టుకు 2వ సారి పాదయాత్ర చేసి తిరిగివచ్చిన బాలింగుల నరేష్ కుమార్‌ను శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యకులు రామకోటి రామరాజు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామనామం తోడుంటే సాధించనిది ప్రపంచంలో ఏది లేదన్నాడు. బాలింగుల నరేష్ కుమార్ అనువనువున రామనామాన్ని నింపుకొని కొండగట్టుకు పాదయాత్ర చేయడం యువతకు స్ఫూర్తిదాయకమన్నాడు. ఈ కార్యక్రమంలో పీర్లపల్లి మాజీ ఎంపిపి సుదర్శన్ రెడ్డి, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదిరెడ్డి, పాపిరెడ్డి, మైపాల్ రెడ్డి, తుక్కారామ్, వెంకటేశం గౌడ్, హనుమాన్ భక్త బృందం పాల్గొన్నారు.

గత సంక్షేమ పథకాలే వెంకట్రామ్ రెడ్డిని గెలిపిస్తాయి

- కౌన్సిలర్ రజిత గౌడ్

నవతెలంగాణ-గజ్వేల్



గత కేసీఆర్ సంక్షేమ పథకాలే. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రామ్ రెడ్డిని గెలిపిస్తాయని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఆరో వార్డు కౌన్సిలర్ బబ్బూరి రజిత గౌడ్ అన్నారు. గత పది సంవత్సరాలుగా గజ్వేల్ నియోజకవర్గంతో పాటు గజ్వేల్ మున్సిపల్‌ను కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని 70 సంవత్సరాలు అభివృద్ధి ముందుకు పోయిందని, ఇది ప్రజలకు వివరించి ఓట్లు అడిగినట్లు ఆమె గుర్తు చేశారు.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో కేవలం బస్సు ప్రయాణానికి పరిమితమైందని మహిళల నుంచి ప్రతిస్పందన వస్తుందన్నారు. పెళ్లిళ్ల కోసం తులం బంగారం, లక్ష రూపాయలు హామీలు నెరవేర్చలేదన్నారు. కేసీఆర్, హరీశ్ రావు గజ్వేల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేస్తున్నారన్నారు.

అథ్లెటిక్స్ క్రీడలో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్



నవతెలంగాణ-సిద్దిపేట

అథ్లెటిక్స్ క్రీడలో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ తల్లిదండ్రులకు, శిక్షకులకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకట స్వామి గౌడ్, జిల్లా సైకిల్ సంఘం అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, టిజీ పేట జిల్లా అధ్యక్షులు ఏర్వ అశోక్, జిల్లా రెజ్లింగ్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కనకయ్య జిల్లా ప్రవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షులు బయ్యారపు కనకరెడ్డి , శిక్షకులు ప్రభాకర్, కృష్ణ కుమార్, నిశాంక్ గౌడ్, శ్రీకాంత్, సాయికుమార్ గౌడ్, లీలా ఆనంద్, బట్టు వేణు, సీనియర్ అథ్లెట్లు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- రైతులు రశీదులు తప్పని సరిగా తీసుకోవాలి
- ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన ఎస్సై అపూర్వ రెడ్డి, ఏఓ రమణ

నవతెలంగాణ-సిద్ధిపేట రూరల్



నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అపూర్వ రెడ్డి, ఏఓ రమణలు హెచ్చరించారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి రమణతో కలిసి ఎస్ఐ అపూర్వరెడ్డి తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కల్తీ విత్తనాలు అమ్మినా, కృత్రిమంగా విత్తనాల కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మన మండలంలో వరి, మొక్క జొన్న, పత్తి విత్తనాలు కొరత లేదని, ఎటువంటి వదంతులు నమ్మవద్దని సూచించారు. ఆకస్మికంగా జరిపిన తనిఖీల్లో భాగంగా విత్తన దుకాణాలలో రిజిష్టర్లు, బిల్ బుక్కులు అన్ని పరిశీలించారు. నకిలీ విత్తనాల పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని రైతులకు సూచించారు.

నిరుపేద కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటాం

- బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికుడు పరశురాములు మాతృవియోగంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. అధైర్య పడవద్దని తామంతా అండగా ఉన్నామని భరోసా కల్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యంతో పాటు రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించారు. పేద ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, మాజీ ఎంపీటీసీ భైరయ్య, బీఆర్ ఎస్ నాయకులు గొల్ల రాములు, మల్లయ్య, పసుల కాడి రమేష్, ఐలయ్య పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతం

- ప్రతి ఒక్కరు భాగ స్వాములు కావాలి
- విద్యాధికారి ప్రభుదాస్

నవతెలంగాణ-మిరుదొడ్డి



ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకు ప్రతి ఒక్కరు భాగ స్వాములు కావాలని మండల విద్యాధికారి ప్రభుదాస్ పేర్కొన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఈ నెల 3 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు మెరుగైన విద్యా బోధన అందించడం జరుగుతుందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఎస్సై పరశురాములు, ఎస్సీ బీసీ వసతి గృహాలు సంరక్షణ అధికారులు రాజారాం, మండల పర్యవేక్షణ అధికారి నారాయణ, సిఆర్పిలు నర్సింలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

పచ్చిరొట్ట విత్తనాలతో భూమికి ఎన్నో ప్రయోజనాలు

- భూమిని ఖాళీగా ఉంచకుండా విత్తనాలు చల్లాలి
- సేంద్రియ ఎరువుగా మారి అధిక దిగుబడి

నవతెలంగాణ-కోహెడ

తొలకరి వర్షాలు కురిసే సమయంలో భూమిని ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూమికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. జీలుగా, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను ఈ సీజన్లో పోలాల్లో చల్లాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. పెరిగిన తర్వాత ఆ మొక్కలను దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుందన్నారు. దీంతో రసాయనిక ఎరువులను వాడటం తగ్గించవచ్చని సూచిస్తున్నారు. ఎప్పుడు ఒకే రకమైన పంట పండిస్తున్న క్రమంలో మొగిళిపురుగు, కాండం తొలుచు పురుగు వంటి వ్యాధులు పంటకు వచ్చే అవకాశం ఉంది. పచ్చిరొట్ట విత్తనాలను చల్లినట్లయితే ఆరోగ్యకరమైన పంట రావడంతో పాటు రైతులకు పంట దిగుబడి సైతం పెరుగుతుంది. అలాగే డీఏపీ వాడకం కూడ తగ్గే అవకాశం ఉండడం వల్ల రైతుకు ఖర్చు తగ్గుతుంది. మండలానికి ఇప్పటి వరకు 900 బ్యాగులు (20 టన్నులు) వచ్చినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాగే సుమారు 30 టన్నుల వరకు మండలానికి అవసరం ఉందని పేర్కొన్నారు. మండలంలోని కోహెడ, శనిగరం, బస్వాపూర్ గ్రామాలకు పచ్చిరొట్ట ఎరువులు ట్రాన్స్‌పోర్ట్ అవుతున్నట్లు ఏవో భోగేశ్వర్ తెలిపారు. రైతులు పచ్చిరొట్టను చల్లడం వలన ఎకరానికి సుమారు 1500 వరకు ఖర్చు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనాలు

- జీలుగా, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలను జల్లుకుంటే భూమి కోతకు గురికాదు.
- పచ్చిరొట్ట పైరు పోలంలో కలుపు మొక్కల పెరుగుదలను నివారిస్తుంది
- పచ్చిరొట్ట పైరు పూతదశలో ఉండగా లేదా విత్తనాలు జల్లిన 50 రోజుల తర్వాత పోలాన్ని కలియదున్నాలి
- ఈ విధంగా చేయడం వలన నేలకు సేంద్రియ పదార్థం అంది నేల గుల్లబారుతుంది. దీని వల్ల మొక్కల వేళ్ళు బాగా పెరిగి పోషకాలు బాగా గ్రహిస్తాయి. నేలల్లో చౌడు తగ్గుతుంది
- నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు సైతం వృద్ధి చెందుతాయి.
- జనుము, జీలుగు పైర్ల వేళ్ళపై ఉండే బుడిపెలు గాలిలోని నత్రజనిని స్వీకరిస్తుంది
- కుళ్ళిన రొట్ట ద్వారా భూమికి నత్రజని, భాస్వరం, పోటాష్ వంటి ఎరువులు తర్వాత వేసే పంటలకు లభిస్తుంది
- సూక్ష్మపోషకాలైన ఇనుము, జింక్ మెగ్నీషియం, కాల్షియం వంటివి భూమి నుంచి లభిస్తాయి.
- పచ్చిరొట్ట పైర్ల వల్ల ఎకరాకు 7కిలోల నత్రజని, కిలో భాస్వరం, 5కిలోల పొటాష్ వంటి ఎరువులు పంటకు లభిస్తాయి. తద్వారా రసాయనిక ఎరువుల వాడకం తగ్గి దిగుబడి పెరుగుతుంది.

పచ్చిరొట్టతో భూమికి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి

మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్



పచ్చిరొట్ట విత్తాలను జల్లడం వలన భూమిలో పోషకాలు వృద్ధిచెంది ఎన్నో ప్రయోజనాలుంటాయి. చౌడు భూముల్లో పంట దిగుబడి ఆశించినంత రాదు అందువలన పచ్చిరొట్ట విత్తనాలను చౌడుభూముల్లో జల్లడం వలన సేంద్రియ ఎరువుగా మారి ఎంతో లాభం చేకూర్చుతుంది. పచ్చిరొట్టపై రైతులకు అవగాహన కలిగియుండాలని సూచించారు. అలాగే ఫర్టిలైజర్ షాపు యజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే తగు చర్యలు తప్పవు.

పచ్చిరొట్టతో పంటకు బలం

కొమ్మిడి బాల్‌రెడ్డి (తీగలకుంటపల్లి రైతు)



మూడేకరాల భూమిలో రెండు బస్తాలు పచ్చిరొట్ట విత్తనాలను(జీలుగా) చల్లాను. పచ్చిరొట్టతో భూమికి బలం చేకూరి పంట దిగుబడి పెరుగెందుకు దోహదపడుతుంది. పచ్చిరొట్ట విత్తనాలు సేంద్రియ ఎరువుగా మారి సాగు చేసే పంటలకు రసాయన ఎరువులు (అడుగు ఎరువులు) వాడకం తగ్గుతుంది. పంటలకు తగినంత పోషకాలు లభిస్తాయి.

రసాయన ఎరువుల వాడకం తగ్గింది

పెర్యాల నరేందర్‌రావు (కోహెడ రైతు)



భూమిలో పచ్చిరొట్ట ఎరువులు చల్లడం వలన రసాయన ఎరువుల వాడకం తగ్గింది. అలాగే పంట వ్యాధుల భారిన పడకుండా ఆరోగ్యవంతరమైన పంట చేతికి అందుతుంది. వర్షం పడగానే ఎరువులను చల్లేందుకు సిద్ధంగా ఉన్నా. అవసరమైనంత పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉండడం లేదు. వ్యవసాయ అధికారులు చొరవ తీసుకొని ఎక్కువ విత్తనాలు అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలి.

పేద విద్యార్థినులకు విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం

- 9 తరగతి నుంచి విద్యార్థినులకు ఉచిత విద్యకు ప్రవేశం
- పీజీ వరకు చదువు తదనంతరం ఉపాధి
- సత్య సాయి ప్రశాంతి నికేతన్ కళాశాల చైర్ పర్సన్ పూర్ణిమ శంకర్

నవతెలంగాణ-కొండపాక

సనాతన సంప్రదాయాలను సంస్కృతిని భావితరాలకు అందించడమే సత్య సాయి ప్రశాంతి నికేతన్ లక్ష్యమని సత్యసాయి ప్రశాంతి నికేతన్ కళాశాల చైర్ పర్సన్ మహాభాష్యం పూర్ణిమ శంకర్ తెలిపారు. కొండపాక శివారులోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొండపాక శివారులో ఆనంద నిలయం ఆవరణలో సత్యసాయి ప్రశాంతి నికేతన్ స్థాపించి ఐదు సంవత్సరాలు పూర్తయిందని ఆరో సంవత్సరం అడుగెడుతున్న సందర్భంగా యూనివర్సిటీ క్యాంపస్ ను ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థినులకు ఉచితంగా విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో పిజి వరకు ఉచిత విద్య అందించి, అనంతరం ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యను ఉచితంగా అందించడంతోపాటు మన సనాతన ధర్మాలను, ఆధ్యాత్మికతను సంస్కృతి సంప్రదాయాలను అందిస్తున్నట్లు తెలిపారు. చదువుకోలేని పరిస్థితిలో ఉన్న మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినిలకు చదువు అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు అండగా నిల్వాలన్నదే సత్య సాయి ట్రస్ట్ ప్రతినిధి సద్గురు మధుసూదన సాయి లక్ష్యం అని పేర్కొన్నారు. ఇక్కడనే చదివిన పిల్లలు తమ చదువు పూర్తి చేసుకుని మళ్లీ ఉపాధ్యాయులుగా ఉపాధి పొందుతున్నారన్నారు. సొసైటీకి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ సంవత్సరం 9వ తరగతి ప్రారంభిస్తున్నామని అలాగే యూనివర్సిటీలో కంప్యూటర్, డ్యాన్స్ , ఆర్ట్స్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటి మహిళా ఉచిత యూనివర్సిటీ అని పేర్కొన్నారు.

5 సంవత్సరాల్లో 700 మందికి విద్యాబోధన

ఐదు సంవత్సరాల్లో 700 మంది పేద విద్యార్థులకు చదువు అందించామని, ప్రస్తుతం 120 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 28 క్యాంపస్ లు నడుస్తున్నాయని అందులో ఎనిమిది బాలికలకు, 20 బాలురకు అని తెలిపారు. వీటన్నిటిలో గ్రామీణ ప్రాంత పిల్లలకే ప్రాధాన్యమిచ్చి విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తమ



సొంత పిల్లలుగా భావించి విద్యార్థినులకు కొన్ని సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యాలయాలతో పాటు వైద్యాలయాలు కూడా నిర్వహిస్తున్నారని కొండపాక శివారులో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరలోనే ఏర్పాటు కానున్నట్టు తెలిపారు. 600 మండలాల్లో 28 వేల పాఠశాలల విద్యార్థులకు అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా అల్పాహారం రాగి జావా అందిస్తున్నామన్నారు. కళాశాల ఆవరణలో గోశాల నిర్వహిస్తున్నామని దాని పోషణ కోసం వస్తు రూపేనా దాతలు సహకరించవచ్చన్నారు. సత్యసాయి సంస్థలో చదువుకొని ఉపాధి పొందుతున్న పలువురు విద్యార్థులు తమ అనుభవాలను తెలిపారు. కళాశాల అధ్యాపకులు రాధిక, జయశ్రీ , శంకర్ తదితరులు మాట్లాడారు

బాలల స్వీయ రక్షణకు కరాటే ఎంతో ఉపయోగకరం

- ఎస్ఐ విక్కుర్తి రఘుపతి

నవతెలంగాణ-రాయపోల్



బాలలకు విద్యతోపాటు స్వీయరక్షణ, శరీర ఎదుగుదలకు మానసికోల్లాసానికి క్రీడలు, కరాటే ఎంతో ఉపయోగకరమని ఎస్ఐ విక్కుర్తి రఘుపతి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా యువజన సంక్షేమ , క్రీడల శాఖ సహకారంతో నిర్వహించిన కరాటే వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు క్రీడాకారులకు విద్యార్థులకు చదువుతోపాటు కరాటే ఎంతో ఉపయోగకరమని ముఖ్యంగా బాలబాలికల స్వీయరక్షణకు కరాటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమాజంలో బాలికలు, మహిళలపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వాటి నుంచి రక్షణ పొందడానికి కరాటే ఉపయోగపడుతుందన్నారు. బాలబాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో నైపుణ్యాన్ని కలిగి ఉండాలని ప్రస్తుత సమాజంలో విద్యార్థినులకు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి కరాటే శిక్షణ ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. వేసవి శిబిరం కరాటేలో మెళకువలు నేర్చుకొని పరిణితి సాధించి జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిలో మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు నరేందర్, పోలీస్ సిబ్బంది దేవ రాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

- బడిబాట కార్యక్రమంలో విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జగదేవపూర్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని జగదేవపూర్ మండలపరిషత్ అభివృద్ధి అధికారి యాదగిరి అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల క్షేత్ర స్థాయి అధికారులతో బడిబాట కమిటీ ఏర్పాటు చేసి అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో బడి వయసు కలిగిన పిల్లలను అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పూర్వవిద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేసుకుని బడి ఈడు పిల్లలు ఎవరు బడి బయట లేకుండా కృషి చేయాలన్నారు. మండల వ్యాప్తంగా బాలకార్మికులు లేకుండా చూడాలన్నారు. మండల నోడల్ అధికారి ఏం.మాధవ రెడ్డి రోజువారిగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి గ్రామ స్థాయిలో ర్యాలీ చేపట్టి సమీక్ష చేయాలని, హాజరైన పంచాయితీ కార్యదర్శులు, మహిళా సంఘాల అధ్యక్షులను కోరారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ వర్మ , పంచాయతీ ఇంజనీర్ దేవయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రజిత, సునీత, గ్రామ కార్యదర్శులు ప్రశాంత్, ఆయా గ్రామాల కార్యదర్శులు, స్వయం సహాయక బృందాల క్లస్టర్కో ఆర్డినేటర్లు బాబు, అనురాధ,ఫెల్డ్ అసిస్టెంట్లు సాంబయ్య,నర్సింహారెడ్డి, ఆయా గ్రామాల క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయం

నవతెలంగాణ-గజ్వేల్



మెదక్ పార్లమెంటు నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయం ఖాయమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పార్టీ సీనియర్ నాయకులు తలకొక్కుల దుర్గాప్రసాద్ తెలిపారు. గత ప్రభుత్వం అభివృద్ధి మూలంగానే వెంకట్రాం రెడ్డి విజయం ఖాయమన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కృషితో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అడిగామని మహిళలు, రైతుల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. బీజేపీ కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు కేసీఆర్ రావాలి

- మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్

నవతెలంగాణ-గజ్వేల్



దశాబ్ది ఉత్సవాలకు గజ్వేల్ కేంద్రానికి మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రెండుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ గజ్వేల్ వైపు చూడకపోవడం సిగ్గుచేటన్నారు. కనీసం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గజ్వేల్ క్యాంప్ కార్యాలయంకు రావాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కేసీఆర్ రాకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపడతామని వారు హెచ్చరించారు. అవసరమైతే ఎమ్మెల్యే కార్యాలయానికి తాళం వేస్తామని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే లేకుండా ఇతరులు అందులో చలామణి అవుతున్నారని వారు చెప్పారు. 2009, 2014, 2018 ఎన్నికల్లో కేసీఆర్, హరీష్ రావులను తిట్టిపోసిన ప్రతాప్ రెడ్డి ఇప్పుడు వాళ్ళని ఎత్తుకొని సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి వంటేరు ప్రతాపరెడ్డికి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని. ఇంద్ర పార్క్ చౌరస్తాలో అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మాజీ కౌన్సిలర్లు నక్క రేగొండ గౌడ్, సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి , రాజ్ కుమార్, మాజీ సర్పంచ్ తాళ్ల అంజనేయులు గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత సయ్యద్ మతిన్, మైనార్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సమీర్, మైనార్టీ జిల్లా నాయకులు అజ్గర్ అంజనేయులు యాదవ్ , కాంగ్రెస్ పార్టీ నేతలు గుండు లక్ష్మణ్, పంజాల రమేష్ గౌడ్ అంజద్ జహీర్ క్యాసారం బాబా, మల్లారెడ్డి నేత నాగరాజు మామిడి కృష్ణ, భాస్కర్, శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటు చేయాలి

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

నవతెలంగాణ-మిరుదొడ్డి



ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటు చేయాలని డి బిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. దళితులకు పేదలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడానికి బడిబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం బాగుందన్నారు. పకడ్బందీగా ప్రతి పాఠశాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటూ మనువాద శక్తుల ఎజెండాను ఓడించి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేయడానికి ఐక్య కార్యచరణ చట్టాన్ని ఈ మహాసభలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులు కేటాయించి తెలంగాణ సమాజాన్ని విద్య వైజ్ఞాన రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గురుకుల సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కాస్మోటిక్ చార్జిలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో అంతర్జాతీయ ప్రణాళికతో కూడిన విద్య విద్యాలను ప్రవేశపెట్టి అంబేద్కర్ విద్యానిధి బెస్ట్ అవైలబుల్ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. పౌరులందరికీ నాణ్యమైన విద్య వైద్యం అందించాలన్నారు. భూ సంస్కరణ అమలు చేసి దళిత బహుజనలకు భూమి పంపిణీ చేసి జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ, పట్టణంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన 6 గ్యారంటీలను ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సమగ్ర అమలుచేసి నిధులు కేటాయించాలన్నారు. గృహ నిర్మాణ కార్మికుల సంక్షేమ సమగ్ర చట్టం అమలు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు ఈ కార్యక్రమంలో శంకర్ , చంద్రం, శీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల 132 కేవీ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు ఉన్నందున విద్యుత్తు సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఏడీఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలం లోని అన్ని గ్రామాల్లో ఉదయం 08 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బందికి మండల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

పశువుల అంగడి (సంత)ని యధావిధిగా కొనసాగించాలి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలో గతంలో ఉన్న పశువుల అంగడి(సంత)ని యధావిధిగా కొనసాగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో అశోక్ మాట్లాడుతూ సుమారు 70 ఏళ్ల క్రితం ఏర్పడిన అంగడి స్థలాన్ని ఓ మాజీ ఎమ్మెల్యే కబ్జా చేయడంతో చేర్యాల ప్రాంత ప్రజలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. రైతులు వివిధ జిల్లాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండలాల నుండి పశువులను తీసుకొచ్చి క్రయవిక్రయాలు జరుపుతుండేవారని, వర్షాకాలంలో విత్తనాలు వేసే సమయం వస్తున్న క్రమంలో దుక్కులు దున్నడానికి పశువులు దొరకక పోవడంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. యధావిధిగా ప్రతి మంగళవారం పశువుల సంత కొనసాగే విధంగా అధికారులు, చేర్యాల ప్రాంత ప్రజలు ఏకమై సంతను పున: ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఈరి భూమయ్య, బండారి సిద్ధులు, గూడెపు సుదర్శన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 01 జూన్ 2024 | www.navatelangana.com

కొండగట్టు బయలుదేరిన హనుమాన్ మాలాధారణ స్వాములు



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రం నుంచి హనుమాన్ మాలధారణ స్వాములు శుక్రవారం కొండగట్టుకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పానుగంటి తిరుపతయ్య, ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం హెూమం నిర్వహించి హనుమాన్ మాలధారణ స్వాములకు ఇరుముడి కట్టి కొండగట్టుకు హనుమాన్ మాలధారణ స్వాములను పంపించారు.

బాధితులకు ఎల్ఓసి అందజేసిన మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల దౌలాపూర్ గ్రామానికి చెందిన రాలబండి కళ్యాణి భర్త బ్రహ్మం గత కొన్ని రోజుల క్రితం థైరాయిడ్ సమస్యతో నిమ్స్ హాస్పిటల్‌లో చేరగా అధిక డబ్బులు ఖర్చు అయ్యాయి. ఖర్చుల నిమిత్తం చిలుకూరి మధుసూదన్ రెడ్డిని ఆశ్రయించగా ఆయన రాష్ట్ర మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ మాజీ ఏం సి వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సానుకూలంగా స్పందించి మాజీ సీఎం కేసీఆర్‌తో ఎల్‌వోసిని మంజూరు చేసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు జూపల్లి మధు, జూపల్లి బంగారి కేశమైన మహేందర్ యాదవ్ ముక్కెర నాగరాజు,కొన్నే స్వామి మ్యాడమైన సిద్ధులు తదితరులు ఉన్నారు.

నేడు బడిబాటపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-మద్దూరు

జూన్ 3 నుంచి 19 వరకు జరగనున్న బడిబాటపై చర్చించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో రామ్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట సమీక్ష సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని లింగాపూర్, దూల్మిట్ట, గ్రామాలలో నిర్మిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఎంపీడీవో రామ్ మోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పున ప్రారంభం అయ్యేలోపు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, ఏ.ఈ.పి.ఆర్.వినయ్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుకునూరుపల్లి పాఠశాలను సందర్శించిన ఉన్నతాధికారులు



నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించనున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను చీఫ్ ఇంజనీర్ అనిల్ కుమార్, డిప్యూటీ ఇంజనీర్ మక్బూల్, ఏఈ రాజు గౌడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పనులు తొందరగా అయ్యే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులు సత్తయ్యకు సూచించారు. పాఠశాలలో అన్ని పనులు నాణ్యతతో ఉండే విధంగా చూడాలని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకు అసౌకర్యంగా ఉండేవిధంగా ఉండొద్దని, వారికి త్రాగునీటి సౌకర్యము, టాయిలెట్స్ విద్యుత్ పనులను పరిశీలించి సంతృప్తి చెందారు. పాఠశాలలు తెరిచే లోపు అమ్మ ఆదర్శ కమిటీ సంబంధించిన పనులు పూర్తి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్తయ్య అమ్మ ఆదర్శ కమిటీ సభ్యురాలు నవనీత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షలతో ఇరువురిపై నలుగురు యువకుల దాడి



ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-దుబ్బాక

వ్యక్తిగత కక్షలతో ఇరువురిపై నలుగురు యువకులు దాడి చేయగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన దుబ్బాక పురపాలిక కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగింది. ఘటనకు వ్యక్తిగత కక్షలే కారణమైనట్లు పోలీసుల విషయంలో తేలింది. శుక్రవారం దుబ్బాక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిద్ధిపేట ఏసీపీ జీ.మధు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహమ్మద్ రశాద్, విష్ణు అనే ఇద్దరు యువకులు వారి కారులో దుబ్బాకలోని గంగమ్మ గుడివద్ద ఉండగా పట్టణ కేంద్రానికి చెందిన దేవుని రమణ, పర్స భాస్కర్, రాచమల్లు వినోద్ అలియాస్ బొమ్మ ఆలేటి శరత్ అనే నలుగురు యువకులు అప్పటికే తీవ్రంగా మద్యం సేవించి లచ్చపేట నుంచి దుబ్బాకకు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో గంగమ్మ గుడి సమీపంలో ఉన్న విష్ణు, మహమ్మద్ రశాద్‌లను అడ్డగించి వారిపై బీరు బాటిల్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. వీరి కారును ధ్వంసం చేశారు. ఈ నలుగురు యువకుల దాడిలో విష్ణు, రశాద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిరువుని చికిత్స నిమిత్తం దుబ్బాకలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి సిద్దిపేటలోని జిల్లా హాస్పిటల్‌కి తరలించారు. బాధితుడు మహమ్మద్ రశాద్ భార్య నస్రీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై హత్యాయత్నం కేసును నమోదు చేశామని, నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ జీ.మధు తెలిపారు. దుబ్బాక సీఐ పీ.శ్రీనివాస్, ఎస్ఐ వీ.గంగరాజు, హెడ్ కానిస్టేబుల్ హరిసింగ్, సిబ్బంది శ్రీనివాస్, అశోక్, గణేష్ ఉన్నారు.

విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలి

- విద్యుత్ శాఖ ఎస్ ఈ మోహన్ రెడ్డి



నవ తెలంగాణ-సిద్దిపేట

రైతులకు, పరిశ్రమలకు, గృహ వినియోదారులకు, అన్ని రకాల విద్యుత్ వినియోదారులకు వర్షాకాలంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరాను అందించడానికి అవసరమైన మరమ్మతులు చేయడం జరుగుతుందని, అన్ని వర్గాల వారు తమకు సహకరించాలని విద్యుత్ శాఖ ఎస్ ఈ మోహన్ రెడ్డి కోరారు. శుక్రవారం ఎస్ఈ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యుత్ శాఖ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలలో స్తంభాలపై ఉన్న విద్యుత్ వైర్లు సాగి ఉన్నాయని, కొన్ని స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉందని అలాంటి వాటిని సరి చేయడానికి, మరమ్మత్తుల కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అన్ని వర్గాల వారికి విద్యుత్ అందించడానికి సరిపడేంత విద్యుత్తు ఉందన్నారు. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా మరో 8 ఉప కేంద్రాలు మంజూరు కోసం అంచనాలను పంపించడం జరిగిందని, ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో, లోడును తగ్గించడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కూడా ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. వర్షాకాలం రావడానికి ముందుగానే తమ సిబ్బంది మరమ్మత్తులు చేస్తారని, అప్పుడు జరిగే విద్యుత్ అంతరాయానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోరలు చాస్తున్న కులవివక్షత..!

- సిద్దిపేట జిల్లాలో బహిర్గతమైన కులవివక్షత అనవాళ్లు
- సీతారాంపల్లి ఆలయంలోకి దళితులకు ప్రవేశం లేదంటూ అడ్డగింత
- అంటరాని వారంటూ అగ్రవర్ణాల దూషణలు
- చొక్కాతో కట్టి ఆలయ ద్వారాలు మూసివేసిన వైనం
- సంఘటనపై ఏసీపీ,సీఐ,ఎస్ఐ విచారణ
- అడ్డుకున్న అగ్రవర్ణ వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు
- అధికారులు వివక్ష చూపొద్దంటూ అయా సంఘాల విజ్ఞప్తి

భారత దేశం విభిన్న సంస్కృతులకు, సర్వ మతాలకు నిలయం. ఎవరు ఎవరికి పెద్దవారు కాదు. ఇచ్చిపుచ్చుకునే గౌరవం, మర్యాదలు, వ్యక్తిత్వంపై అధారపడుతుంది. వ్యక్తిత్వంతోనే సమాజంలో మానవులు తమ మనుగడను సాగిస్తున్నారు. కులం, మతం, వర్గమనే బేధాలేమి లేవు. మనమందరం భారతీయులం. మన రాష్ట్రం తెలంగాణ అంటూ ఇలా ప్రాంతాలతో ముడి పెడుతూ పైకి ఒకరకంగా ఉంటూ అంతర్గతంగా క్రూర మృగాలకంటే అధ్వాన్నంగా వ్యవహరిస్తున్నారు కొందరు కుల దురంహకారులు. సిద్దిపేట జిల్లాలో గతంలో కులవివక్షత అనావాళ్లు బయల్పడిన సందర్భాలున్నాయి. ఇటీవల గత మూడు రోజుల క్రితం హిందువులు దైవంగా భావించే హనుమాన్ దీక్షలో కులవివక్షత అనవాళ్లు మళ్లీ పునారావృతమై వెలుగులోకి వచ్చాయి. దీంతో జిల్లాలో అంతర్గతంగా కులవివక్షత కోరలు చాచిందని స్పష్టమవుతోంది. అగ్రవర్ణాల వ్యక్తులు ఎస్సీ సామాజిక వర్గాల వ్యక్తులపై అసభ్య పదజాలంతో దూసిస్తూ సభ్యసమాజం సిగ్గుపడేలా వ్యవహరించిన తీరు జిల్లాకు ఒక చెరగని మచ్చల ఏర్పడింది. వానరం రూపం నుంచి అంచెలంచేలుగా మానవుడిగా రూపాంతరం చెంది అత్యంత సాంకేతిక అధునిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చినా మానవుడు వ్యవహరించే విధానంలో మార్పు చెందకపోవడం దురదృష్టకరం. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నో నూతన అవిష్కరణలు అవిష్కృతమవుతుంటే సమాజంలో కొందరు మూడనమ్మకాలు, కులవివక్షత చూపిస్తూ మేము అగ్రవర్ణాల కులస్తులమంటూ గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ప్రపంచ దేశాలలో ప్రాంతాలవారీగా మానవుల సంస్కృతులు వేరుగా ఉన్న మనుషుల్లో ప్రవహించే రక్తం "ఎరుపు"రంగులోనే ఉంటుదనే విషయాన్ని విస్మరించడం అనాగరికతకు దర్పణం పడుతోంది. భూగ్రహం నుంచి చంద్రగ్రహణానికి పర్యటన సాగించే అభివృద్ధికి చేరిన మానవుడు కుల అహంకార ఉచ్చులో పడి సమాజంలో తమ వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుంటున్నాడు. మానవుడు మారడం మొదలుపెడితే.. సమాజం మారుతోంది. సమాజం మారితే ప్రాంతాలు మారుతాయి. ఇలా ఒకటి తర్వాత మరొకటి మారుతూ దేశం, ప్రపంచం, వ్యవస్థలు చక్కబడుతాయి. కులవివక్షతను రూపుమాపాల్సింది మానవుడేనని అలోచన చేస్తేనే తెలంగాణ వాదులం.. భారతీయులమని సగర్వంగా చెప్పుకోవచ్చు.

నవతెలంగాణ-బెజ్జంకి

జిల్లాలోని సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు గ్రామంలోని అగ్రవర్ణాల వ్యక్తులతో పాటు హనూమాన్ దీక్ష మాల దరించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఎస్సీ సామాజిక వర్గం వ్యక్తులు పూజలు చేయడానికి వెళ్లగా ఆలయంలోకి ప్రవేశం లేదంటూ గ్రామంలోని పలువురు అగ్రవర్ణాల వ్యక్తులు అసభ్య పదజాలంతో దూసిస్తూ వ్యవహించిన తీరు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసింది. రాష్ట్రంలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిన సిద్దిపేట జిల్లాలో కులఅహంకార చాయలు బుధవారం వెల్లువెత్తడం పెద్ద దుమారం రేపింది. పటిష్టమైన పోలీస్ యంత్రాంగమున్న కులవివక్షత అనవాళ్లు బయల్పడడం జిల్లోలో చర్చనీయాంశంగా మారింది. అగ్రవర్ణాల్లోని కుల అహంకార కొరలను తొలగించాలంటే పోలీసులు ఉపేక్షించకుండా చట్టపరమైన కఠిన చర్యలు చేపడితేనే కొంతవరకు అరికట్టవచ్చునని ఎస్సీ సామాజిక వర్గాల ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. పోలీస్ యంత్రాంగం చిత్తశుద్ధితో వ్యవహించి కొరలు చాచిన కులవివక్షతను రూపుమాపాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

ఏసీపీ, సీఐ, ఎస్ఐ విచారణ

కులవివక్షతకు గురైన గ్రామస్తుడు మిట్టపల్లి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అపూర్వ రెడ్డి కేసు నమోదు చేశారు.ఏసీపీ మధు, సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వ రెడ్డి సీతారాంపల్లి గ్రామాన్ని సందర్శించి కేసు దర్యాప్తులో విచారణ చేపట్టారు. సదురు వ్యక్తులపై చట్టం చర్యలు తీసుకుంటుందని ఎస్ఐ అపూర్వ రెడ్డి తెలిపారు.

కేసు నమోదైనా కులవివక్షత చూపిస్తున్నారు..

మిట్టపల్లి కిషన్, బాధితుడు సీతారాంపల్లి.



హిందువులు దైవంగా భావించి ఆలయాల్లో పూజలు చేస్తారు. మేము హిందువులమే.అగ్రవర్ణాల వారు భావించిన దైవాన్ని ఎస్సీ సామాజిక వర్గాల వ్యక్తులం దైవంగా భావించి పూజలు చేయడానికి గ్రామంలోని హనుమాన్ ఆలయానికి వెళ్లాం. అగ్రవర్ణాల వ్యక్తులు అసభ్య పదజాలంతో కులంపేరుతో దూషించారు.న్యాయం కోసం పోలీస్ స్టేషన్ యందు పిర్యాదు చేశాం. పిర్యాదు చేసిన అగ్రవర్ణాల వ్యక్తుల్లో ఏ మార్పు రాలేదు. ఇప్పుడు ఉపాధి హామీ పనిలో కులవివక్షతకు పాల్పడుతున్నారు. కులవివక్షతను రూపుమాపాడానికి పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి.

సహంపక్తి బోజనం,సామూహిక పూజలు చేయించాలి

స్కైలాబ్, కేవీపీఎస్ రాష్ట్రాధ్యక్షుడు.



కులవివక్షత సంఘటన జరిగిన సీతారాంపల్లి గ్రామానికి అత్యంత సమీపంలో ఉన్నతాధికారులు కలెక్టర్, ఎస్పీ విధులు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిన సిద్దిపేట జిల్లాలో కులవివక్షత సంఘటన జరగడం దురదృష్టకరం. సంఘటన జరిగిన గ్రామాన్ని కలెక్టర్, ఎస్పీ నేటి సందర్శించకపోవడం చాల బాధాకరం. సీతారాంపల్లిలో వెలుగుచూసిన కులవివక్షత సంఘటనను కేవీపీఎస్ రాష్ట్ర పక్షాన ఖండిస్తున్నాం. కులఅహంకారంతో దూషించిన అగ్రవర్ణాల వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు అధికారులు చేపట్టాలి. హనుమాన్ మాల దీక్షను కులాలకతీతంగా అందరూ దైవంగా భావిస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక చొరవ చూపి పూజకు పనికిరారంటూ దూషించిన అగ్రవర్ణాల కులస్తులతో పాటు బాధితులను కలిపి సహపంక్తి బోజనం ఏర్పాటుచేసి ఆలయంలో సామూహిక పూజలు నిర్వహించాలి.

కులవివక్షత అనవాళ్లకు అధికారులే బాధ్యులు

బక్కెల్లి బాలకిషన్, కేవీపీఎస్ జిల్లాధ్యక్షుడు.




జల్లాలో గతంలో కులవివక్షత అనావాళ్లు ఏర్పడిన సందర్భులున్నాయి. పౌరహక్కుల దినోత్సవాన్ని సంబంధిత అధికారులు పటిష్టంగా అమలు చేయడంలో తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే సిద్దిపేట జిల్లాలో కులవివక్షత అనవాళ్లు పునారవృతమవుతున్నాయి. పౌరహక్కుల దినోత్సవాన్ని పటిష్టంగా అమలు చేసి కులవివక్షత నిర్మూలనకు పాటుపడాల్సిన బాధ్యత అధికారులదే. ప్రజా సంఘాల నాయకులు పోరాటాలు చేసి సమస్యను అధికారులు దృష్టికి తీసుకువెళ్లడానికి ప్రయత్నం చేస్తాం. అధికారులు వివక్ష చూపకుండా కులఅహంకారులపై చట్టపరమైన కఠిన చర్యలు చేపడితే ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉంటాయి. అధికారులు బాధితులకు న్యాయం చేయాలి.

పౌర హక్కుల దినోత్సవాన్ని మరింత పటిష్టం

ఎం.శ్రీను, సిద్దిపేట రూరల్ సీఐ.



హనుమాన్ గుడిలోకి రానివ్వడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి ఎస్ఐ అపూర్వ రెడ్డితో కలిసి సీతారాంపల్లి గ్రామంలో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టాం. కులవివక్షత చూపిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికి వెనుకాడడం లేదు. గ్రామంలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంది. శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు చేపట్టాం. కులవివక్షతను రూపుమాపాడానికి పౌరహక్కుల దినోత్సవాన్ని మరింత పటిష్టంగా అమలు చేసి అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం.







814 పాఠశాలల్లో 2602 పనుల గుర్తింపు

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చక చక సాగుతున్న పనులు
- రోజువారీగా పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సిద్ధమయింది. గత ప్రభుత్వం



జిల్లాలో ఉన్న కొన్ని పాఠశాలలను ఎంపిక చేసుకొని మన ఊరు మనబడి పథకం ద్వారా పాఠశాలలో సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకున్నది. కానీ ప్రస్తుత జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నది. జిల్లాలో అన్ని రకాల 1018 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 980 లోకల్ బాడీ, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 78 పాఠశాలల్లో విద్యార్థులు లేని మూలంగా పాఠశాలలను మూసివేశారు. కాగా ఉన్న 902 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించారు. 902 పాఠశాలల్లో 814 పాఠశాలలో మాత్రమే మౌలిక వసతుల కల్పన పనుల కోసం ఎంపిక చేసి వాటిలో 2602 పనులను గుర్తించి, పనులు చేస్తున్నారు. ఆయా గ్రామాలలో ఉన్న మహిళ సంఘాల ద్వారా పనులు చేయిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పనులన్నీ పూర్తయి, పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యవసర పనులు...

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాగా అత్యవసరంగా ప్రతి పాఠశాలలో త్రాగునీరు, మరమ్మత్తులు, మూత్ర శాలల రిపేర్, విద్యుతీ కరణ, బాలికలకు అవసరమైన పాఠశాలల్లో కొత్త టాయిలెట్స్ నిర్మాణం. ఈ ఐదు పనులను అత్యవసర పనులుగా గుర్తించి, ఈ పనులను చేయిస్తున్నారు. పంచాయతీ శాఖ ఇంజనీర్లు, టీఎస్ ఈడబ్ల్యు ఐడిసి, మున్సిపల్ శాఖ ఇంజనీర్లు జిల్లాలోని 2602 పనులకు సుమారు రూ.35 కోట్లు అవసరమని అంచనాలను వేశారు. జిల్లా కలెక్టర్ అత్యవసర పనుల కోసం రూ.8 కోట్లను విడుదల చేశారు. పాఠశాలల్లో చేస్తున్న పనులలో రూ.25 వేల లోపు అంచనాలు ఉంటే పనులు పూర్తికాగానే మహిళ సంఘ బ్యాంకు అకౌంట్లో నేరుగా డబ్బులు పడుతున్నాయి. రూ.25 వేల పైగా అంచనాలు ఉండే పనులకు ఎంబి రికార్డులు ఇంజనీరింగ్ శాఖకు అప్పగించిన తర్వాత డబ్బులు రానున్నాయి. మహిళా సంఘాల వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అక్కడ పనులకు అవుతున్న అంచనాలకు అదనంగా మూడు శాతం అంచనాలను చేర్చి పనులు చేయిస్తున్నారు. ఈ మూడు శాతం డబ్బులు మహిళా సంఘాలకు అదనంగా రానున్నాయి.

సీసీఎం ద్వారా మిగతా పనులు..

పాఠశాలలో ఆ ఐదు పనులు కాకుండా, అవి పూర్తి అయిన తర్వాత మిగతా పనులను సీసీఎల్ (కేంద్రీకృత కొనుగోలు విధానం) ద్వారా చేయించనున్నారు. పాఠశాలలకు అవసరమగు డ్యూయల్ డెస్కులు, పెయింటింగ్, గ్రీన్ బోర్డుల పనులను చేయించనున్నారు. వీటికి సుమారు రూ.65 కోట్లు నిధులు అవసరమవుతాయని విద్యాశాఖ అంచనాలు పంపించింది. జిల్లాకు 19,600 డ్యూయల్ డెస్కులో అవసరమవుతాయని జిల్లా అధికారులు అంచనాలు పంపించారు.

రోజువారీగా కలెక్టర్ పనుల పరిశీలన

పాఠశాలలో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ రోజువారీగా పరిశీలిస్తున్నారు. ఎంపీడీవో, ఎంఈఓ, విద్యాశాఖలోని మరో అధికారితో మండలానికి ఒక నోడల్ టీంను ఏర్పాటు చేసి, రోజువారీగా పనులను పరిశీలించిన సమాచారాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 22 పాఠశాలల్లో పనులు పూర్తి అయినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జూన్ రెండో నాటికి 50 శాతం పనులు పూర్తి చేయాలని, 12 నాటికి 100 శాతం పనులు పూర్తి చేయాలనే టార్గెట్‌తో విద్యాశాఖ అధికారులు పనిచేస్తున్నారు.

పంచాయితీల నిర్వహణకు నిధులు సమకూర్చాలి

మండలం పంచాయతీ కార్యదర్శులు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి జగదేవపూర్ మండల పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీల నిర్వహణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చట్టబద్ధంగా రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. గత యేడాదిన్నర కాలంగా నిధులు లేక గ్రామపంచాయతీలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని, సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామని ఎంపీడీవో యాదగిరికి విన్నవించారు. గ్రామ పంచాయతీలకు రావలసిన బకాయిలు అన్ని విడుదల చేసి గ్రామాలను ఆదుకోవాలని కోరారు. ప్రతినెల చెల్లించాల్సిన సిబ్బంది వేతనాలు కరెంటు బిల్లులు ట్రాక్టర్ నిర్వహణ మంచినీటి పంపిణీ పరిశుభ్రత పారిశుద్ధ్యం సంబంధించిన అవసరాలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని నిర్వహణ చేస్తున్నామని తెలిపారు. ఆర్థికపరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొని మానసిక ఒత్తిడికి గురి అవుతున్నామని వెంటనే ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి గ్రామాలను ఆదుకోవాలని తెలియజేశారు. పై అధికారులకు వెంటనే ఈ విషయం తెలియజేసి సమస్య పరిష్కరానికి కృషి చేస్తామ ఎంపీడీఓ యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీనివాసవర్మ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం శతఘటాభిషేకంతో ముగిశాయి. వేడుకల సందర్భంగా ఆలయ వేదపండితుడు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్యన శతఘటాభిషేకం 108 లీటర్ల పండ్ల రసాలతో కూడిన శతకళశాలతో స్వామివారికి సహస్ర ధారాభిషేకం నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారిని విశేష అలంకరణ చేసి పలు రకాల ప్రసాదాలను నివేదించారు. అలాగే ఆలయ పుష్కరిణిలో స్వామివారికి చక్ర తీర్థం, వసంతోత్సవం, శ్రీ పుష్పయాగం ఘనంగా చేశారు. సాయంత్రం యజ్ఞికులకు సన్మానం స్వామివారికి పవళింపు సేవ, దీప దర్శనం నిర్వహించి ఉత్సవాలకు పరిసమాప్తి చేశారు. ఆలయ నిర్వాహకులు టేకులపల్లి రాంరెడ్డి, ప్రొద్దుటూరు రాజుల గుప్తా పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యమైంది

భక్తి శ్రద్ధలతో మనసుకు ప్రశాంతత



నవ తెలంగాణ-మిరుదొడ్డి

భక్తి శ్రద్ధతో మనసుకు ప్రశాంతత కలుగుతుందని అల్వాల గ్రామస్తుడు గుర్రప్ప గారి శేషు అన్నారు. శేషు ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులతో కలిసి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అల్వాల గ్రామంలో వీధి వీధిన తిరిగి హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల గ్రామస్తులు గుర్రప్ప గారి మధు, ప్రసాద్‌తోపాటు గ్రామంలోని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ వివిధ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు...